ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
29-09-2024
ఆదివారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 27 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి





## సామాజిక న్యాయ సాధనకు మీరే ఏజెంట్లు


### ముఖ్య అతిథి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

జయభేరి, హైదరాబాద్ :

నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం (నేషనల్ అకాడమీ ఫర్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్) 21వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్. నర్సింహ అతిథులుగా పాల్గొన్నారు. యూనివర్సిటీ చాన్సలర్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. నల్సార్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ శ్రీకృష్ణ దేవ రావు, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.వాసంతి, మంత్రి సీతక్క, ఇతర ముఖ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పీహెచ్‌డీ, ఎల్ఎల్ఎం, ఎంబీఏ, బీఏ ఎల్ఎల్‌బీ, బీబీఏ తదితర కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకున్న 592 మంది విద్యార్థులకు పట్టాలు అందుకున్నారు. పట్టభద్రులైన వారిలో 57 మంది గోల్డ్ మెడల్స్ సాధించారు.

## అర్బన్ నక్సల్స్ గుప్పిట కాంగ్రెస్

- జమ్మూ కశ్మీర్ ఎన్నికల సభల్లో మోదీ



జయభేరి, జమ్మూ, సెప్టెంబరు 28 :

అర్బన్ నక్సల్స్ గుప్పిట్లో కాంగ్రెస్ పార్టీ ఉన్నదని, వారిని బుజ్జగించడానికి ఆ పార్టీ ఏమైనా చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. కశ్మీర్‌లో జవాన్ల త్యాగాల గురించి కాంగ్రెస్‌కు తెలియదని దుయ్యబట్టారు. ''ఇది కొత్త భారతం. ఇంట్లోకి చొరబడి మరీ హతమారుస్తుంది'' అంటూ 2016లో సరిగ్గా ఇదే రోజు (సెప్టెంబరు 28) పాకిస్థాన్‌పై జరిగిన మిలిటరీ సర్జికల్ స్ట్రైక్స్‌ను ఆయన గుర్తుచేశారు. జమ్మూకశ్మీరుకు రాష్ట్ర హోదా తొలగించి కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం అనేది కొద్ది కాలానికి మాత్రమే తీసుకున్న నిర్ణయమని మోదీ ...మిగతాది 2 లో



## మూసీలో పేదల కన్నీళ్లు పారిస్తున్నారు

**మూసీలో పేద, మధ్య తరగతి ప్రజల కన్నీళ్లు పారిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. మూసీ నిర్వాసితులతో మాట్లాడిన ఆయన... కాంగ్రెస్ సర్కార్ పై విమర్శలు చేశారు. పేదల కన్నీళ్లపై అభివృద్ధి చేయడం ఏంటని హరీశ్ రావు ప్రశ్నించారు.** 2 లో

జయభేరి, హైదరాబాద్ :

మూసీలో గోదావరి నీళ్లు పారిస్తామని చెప్పి, పేద మధ్య తరగతి ప్రజల కన్నీళ్లు పారిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో హైడ్రా బాధితులతో హరీశ్ రావు భేటీ అయ్యారు. బాధితుల కష్టాలు విని హరీశ్ రావు భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం మాట్లాడుతూ...రాహుల్ గాంధీ దేశం అంతా తిరుగుతూ 'బుల్డోజర్ రాజ్ నహి చలేగా' అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్ రాజ్యం నడిపిస్తోందని మండిపడ్డారు. ముందు తెలంగాణకు వచ్చి ఈ బుల్డోజర్లు ఆపాలని రాహుల్ గాంధీకి సూచించారు హరీశ్ రావు. ఆ తరువాత 'బుల్డోజర్ రాజ్ నహి చలేగా' అంటూ అక్కడ ప్రచారం చేయలన్నారు. ప్రభుత్వానికి పేదల ఆశీర్వాదాలు

## ఫ్యామిలీ డిజిటల్ కార్డులో మహిళే యజమాని




జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి అందజేసే డిజిటల్ కార్డుపైన ఆ ఇంటి మహిళనే యజమానిగా గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కుటుంబంలోని సభ్యుల పేర్లు, ఇతర వివరాలను కార్డు వెనుక భాగంలో ఉండే విధంగా కార్డుల రూపకల్పన జరగాలని చెప్పారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల రూపకల్పనపై ముఖ్యమంత్రి సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఈ నెల 25 నుంచి 27 వరకు రాజస్థాన్, హర్యానా, కర్ణాటక, మహారాష్ట్రల్లో డిజిటల్ కార్డుల అమలుపై చేసిన అధ్యయన వివరాలను సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రాష్ట్రంలో జారీ చేసే డిజిటల్ కార్డుల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. ప్రస్తుత రేషన్, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఐటీ, వ్యవసాయ, ఇతర సంక్షేమ పథకాల్లోని డాటా ఆధారంగా కుటుంబాలను నిర్ధారించాలి. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డుల వివరాలు అవసరం లేదు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కోచోట ఒక గ్రామీణ, ఒక పట్టణ ప్రాంతాన్ని ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టుగా దీన్ని చేపట్టాలి. ఫ్యామిలీ డిజిటల్ కార్డుల్లో ఏ ఏ అంశాలను పొందుపరచాలన్న వివరాలను నివేదిక రూపంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కూడిన మంత్రివర్గ ఉప సంఘానికి అందించాలి. మంత్రివర్గ ఉప సంఘం సూచనలకు అనుగుణంగా సమగ్ర వివరాలతో నివేదిక రూపొందించాలి. అక్టోబర్ 3 వ తేదీ నుంచి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఎలాంటి లోపాలు లేకుండా క్షేత్రస్థాయి (డోర్ టు డోర్) పరిశీలన పూర్తి చేయాలి.

## భగ్గుమన్న పశ్చిమాసియా

- ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్బొల్లా చీఫ్ నస్రల్లా హతం
- సురక్షిత ప్రాంతానికి ఇరాన్ అధ్యక్షుడు అలీ ఖమేనీ
- ఇజ్రాయెల్‌పై ఇరాన్‌లో వెల్లువెత్తిన నిరసనలు



జయభేరి, టెల్ అవీవ్, సెప్టెంబర్ 28:

దాడులు, ప్రతి దాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ఆయా దేశాల పౌరులు బిక్కుబిక్కుమంటున్నారు. హెజ్బొల్లా అంతమే లక్ష్యంగా గత కొద్ది రోజులుగా ఇజ్రాయెల్ చేస్తున్న దాడులు లెబనాన్‌లో విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఇప్పటికే వందలాది మంది మరణించారు. తాజా దాడుల్లో హెజ్బొల్లా అధినేత నస్రల్లాను హతమార్చి ఆ సంస్థను దారుణమైన దెబ్బ తీసిన ఇజ్రాయెల్ మరో కీలక విజయాన్ని సాధించింది. ఈ దాడిలో ఇరాన్ ...మిగతాది 2 లో




## అక్కడే దరఖాస్తుల స్వీకరణ

- కొత్త రేషన్ కార్డుల జారీపై ప్రత్యేకంగా సమావేశాలు

**తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీకి రంగం సిద్ధమవుతోంది. అక్టోబర్ లోనే దరఖాస్తులు స్వీకరించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా ఇదే విషయంపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ కీలక ప్రకటన చేశారు.**

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీకి రంగం సిద్ధమవుతోంది. అక్టోబర్ లోనే దరఖాస్తులు స్వీకరించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా ఇదే విషయంపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ కీలక ప్రకటన చేశారు. అర్హులందరికీ డిజిటల్ రేషన్ కార్డులు ఇచ్చేదానిపై ఇటీవలే మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించారు. వాటి మంజూరుకు సంబంధించి త్వరలోనే గ్రామాలు, వార్డుల్లో ప్రభుత్వం ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తుందని తెలిపారు. గ్రామాలు, వార్డుల్లో నిర్వహించే ప్రత్యేక సమావేశాల్లోనే రేషన్ కార్డుల కోసం అక్టోబర్ 2 నుంచే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు జారీ చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో 89.96 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. కొత్త రేషన్‌కార్డులు, హెల్త్ కార్డులు విడివిడిగా అందించనున్నారు.

## అక్రమ కట్టడాల వెనుక పెద్దోళ్ల హస్తం

- పేదలను హైడ్రా ఇబ్బంది పెట్టదు కమిషనర్ రంగనాథ్



జయభేరి, హైదరాబాద్ :

సోషల్ మీడియాలో హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కమిషనర్ రంగనాథ్ అన్నారు. అక్రమ కట్టడాల వెనుక పెద్దవాళ్లు ఉన్నారని ఆరోపించారు. హైడ్రా అక్రమ కట్టడాలను మాత్రమే కూల్చివేస్తుందన్నారు. పేదలకు ఇబ్బంది పెట్టాలని హైడ్రా అభిమతం కాదన్నారు. హైడ్రా అక్రమ కట్టడాలను మాత్రమే కూల్చివేస్తుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో హైడ్రాపై తప్పుడు ...మిగతాది 2 లో




## అమూల్ టర్నోవర్ 59,445 కోట్లు

జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:

అమూల్ పేరుతో పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ అంచనాలకు మించి రాణిస్తున్నది. 2023,24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.59,445 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది వచ్చిన ఆదాయంతో పోలిస్తే ఎనిమిది శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు 50వ వార్షిక సాధారణ సర్వసభ్య సమావేశం అనంతం వెల్లడించింది. అలాగే గ్రూపు టర్నోవర్ రూ.80 వేల కోట్లుగా నమోదైందని తెలిపింది. 202223 ఏడాదికిగాను 72 వేల కోట్లు ఆర్జించింది. ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార బ్రాండ్, బలమైన పాల ఉత్పత్తుల బ్రాండ్‌గా అమూల్ ఎదిగింది. రైతులే యజమానిగా ఎదిగిన అమూల్ కోఆపరేటివ్ సొసైటీలో 36 లక్షల మంది రైతుల నుంచి రోజుకు 300 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నది. ఈ సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ శామల్‌భాయ్ పటేల్ మాట్లాడుతూ.. జీసీఎంఎంఎఫ్ మరో చారిత్రక మైలురాయికి చేరుకున్నదని, ప్రపంచంలో అత్యంత బలమైన ఆహార పదార్థాల బ్రాండ్‌గా అవతరించిందన్నారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## మూసీలో పేదల కన్నీళ్లు..

ఉండాలని, వారిం గోసలు కాదన్నారు. పేదల కన్నీళ్లపై అభివృద్ధి చేయడం ఏంటని హరీశ్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి తన సోదరుడికి నోటీసులు ఇచ్చి, పేదల ఇంటికి బుల్డోజర్లు పంపుతారా? అని ప్రశ్నించారు. పేదల ఇళ్లు కూల్చి మూసీపై పెద్ద భవనాలకు అనుమతి ఇస్తామంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం బాధితుల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుంటుందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలను ఇబ్బంది పెట్టలేదని హరీశ్ రావు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో పాలన చేస్తున్నారని మండిపడ్డారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని మోసం చేశారన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను సీఎం రేవంత్ రెడ్డి దెబ్బ తీస్తున్నారని విమర్శించారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ఆ తర్వాత మూసీపై ముందుకు వెళ్లాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కూకట్ పల్లికి చెందిన బుచ్చమ్మది ఆత్మహత్య కాదని, రేవంత్ రెడ్డి చేసిన హత్య అని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు బిడ్డలకు ఇల్లు కట్టించి పెళ్లిళ్లు చేసిందని, ఇప్పుడు ఆ ఇండ్లు కూలగొడితే తన బిడ్డల భవిష్యత్తు ఏమైపోతుందని ఆందోళనతో బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. ఇవి రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్లే జరుగుతున్నాయన్నారు. తెలంగాణలో కూడా బుల్డోజర్ రాజ్యం నడుస్తుందని విమర్శించారు. హైడ్రా బాధితులందరూ తమ కుటుంబ సభ్యులతో తెలంగాణ భవన్ రావాలని బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధులు సూచిస్తున్నారు. హైడ్రా బాధితులకు అండగా ఉంటామని, బాధితులకు రక్షణ కవచంలా ఉంటామన్నారు. "మా నాన్న చిన్న ఉద్యోగి.. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చినం. ఇప్పుడు ఉన్న ఇల్లు కూల్చేస్తే మా కుటుంబాలు ఏమైపోవాలి".... తెలంగాణ భవన్ లో తమ ఆవేదన చెప్పుకుంటూ హైడ్రా బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. మా కుటుంబాలను రోడ్డున పడేసి ఏం అభివృద్ధి చేస్తారు? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి చర్యలతో ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ నగరంపై ఉన్న నమ్మకం, బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బ తీస్తున్నదని బాధితులు ఆరోపిస్తున్నారు. 'పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న ఇల్లు కూలిపోతే తట్టుకునే శక్తి మాకు లేదు, మా గుండె ఆగిపోతుంది. కంటిమీద కునుకు ఉండట్లేదని, మా బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావట్లేదు. మాకు న్యాయం చేయండి' అంటూ బాధితుల ఆవేదన చెందారు. ఏ అవసరమొచ్చినా తెలంగాణ భవన్ తలుపులు తెరిచే ఉంటాయని, 24 గంటలు బీఆర్ఎస్ న్యాయవాదుల బృందం తెలంగాణ భవన్‌లోనే అందుబాటులో ఉంటుందన్నారు.

## అక్రమ కట్టడాల వెనుక పెద్దోళ్ల హస్తం

ప్రచారం చేస్తున్నారన్నారు. కొన్ని కట్టడాలు కూల్చివేసినప్పుడు హైడ్రాను ప్రశంసించారని, ఇప్పుడు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించే బాధ్యత హైడ్రాకు ఉందన్నారు. శనివారం హైదరాబాద్ ఆయన మీడియాతో మాట్లాడారు. అమీన్‌పూర్‌లో ప్రభుత్వ భూములు పెద్ద ఎత్తున ఆక్రమణకు గురయ్యాయన్నారు. అమీన్‌పూర్‌లోని ఓ ఆసుపత్రిపై గతంలో చర్యలు తీసుకున్నా మళ్లీ తిరిగి నిర్మించారన్నారు. ఆ ఆసుపత్రిని కూల్చిన సమయంలో అందులో పేషెంట్లు ఎవరూ లేరన్నారు. ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేశామని, దాని పక్కన ఉన్న గుడిసెలను కూల్చలేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ప్రజలు నివసిస్తున్న భవనాలను ఎక్కడా కూల్చలేదని తెలిపారు. ముందస్తు సమాచారం ఇచ్చినా కొందరు భవనాలను ఖాళీ చేయడంలేదన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి భవనాలు కట్టిన వారికి సరైన సమయం ఇచ్చిన తర్వాతే ఆ ఆక్రమణలు కూల్చివేస్తున్నామన్నారు. కూకట్‌పల్లి నల్ల చెరువులో ఆక్రమణలు కూల్చివేశామన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు చెరువులను ఆక్రమించరని, అక్రమ కట్టడాల వెనుక పెద్దవాళ్లు ఉన్నారని రంగనాథ్ ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు సీఎం హైడ్రాను తీసుకొచ్చారన్నారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తూ ఊరుకోమన్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు చెరువులు నాలాలను కాపాడుకోలేమన్నారు. పేదలకు ఇబ్బంది పెట్టాలని హైడ్రా అభిమతం కాదన్నారు. ఒవైసీ, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సంబంధించిన కాలేజీలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. విద్యా సంవత్సరం నష్టపోతారనే వాటిపై చర్యలు తీసుకోలేదన్నారు. హైడ్రాను బూచిగా చూపించి ప్రజలను భయపెడితే భవిష్యత్ తరాలకు నష్టపోతాయని కమిషనర్ రంగనాథ్ అన్నారు. చెరువులు, ప్రభుత్వ భూములను ఎవరు కాపాడలేరన్నారు. జన్వాడ ఫామ్‌హౌస్ 111 జీవో పరిధిలో ఉందని, అది హైడ్రా పరిధిలోకి రాదన్నారు. అమీన్ పూర్ లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయన్న హైడ్రా కమిషనర్, అన్ని వ్యవస్థలను మేనేజ్ చేస్తామన్న ధీమాతో కొందరు బడా వ్యక్తులు ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారన్నారు. N కన్వెన్షన్ కూల్చినప్పుడు పక్కనే ఉన్న గుడిసెలను తొలగించలేదన్నారు. కొందరు అక్రమ వ్యాపారాలు చేస్తూ.. హైడ్రా వచ్చినప్పుడు కిరోసిన్, పెట్రోల్ తో ఆందోళన చేస్తున్నారన్నారు. కూకట్ పల్లి చెరువు దగ్గర ఉన్నవారికి ముందస్తు సమాచారం ఇచ్చామని రంగనాథ్ వెల్లడించారు. కొందరు సీరియస్‌గా తీసుకోలేదని, వారిని ఖాళీ చేయించిన తరువాతనే కూల్చివేతలు స్టార్ట్ చేశామన్నారు. హైడ్రా అనేది ఒక బూచిగా చూపించి బుచ్చమ్మను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. హైడ్రా అంటే భరోసా.. అయితే కొందరు హైడ్రాను బూచిగా చూపిస్తున్నారు అది సరైంది కాదన్నారు. పేదవాళ్లను ఇబ్బందులు గురిచేసేందుకు హైడ్రా ఉండదన్నారు. ఇప్పటి వరకు హైడ్రా ఖాళీగా ఉన్న భవనాలు మాత్రమే కూల్చివేసిందన్నారు. పేదల పట్ల ఒకలా, పెద్దోళ్ల పట్ల మరోలా హైడ్రా వ్యవహరించదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన పెద్ద వాళ్లే లక్ష్యంగా హైడ్రా కూల్చివేతలు చేస్తుందన్నారు. హైడ్రా సైలెంట్ గా లేదని తన పని తాను చేస్తుందన్నారు. మూసీ నిర్వాసితులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటామని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ దాన కిషోర్ తెలిపారు. గతంలో మూసీకి వరదలు భారీగా వచ్చేవని, అప్పట్లో నిర్వాసితులను తరలించారన్నారు. గతంలో మూసీ సుందరీకరణకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య పలు సూచనలు చేశారు. చిన్న వర్షాలకే హైదరాబాద్ ముంపునకు గురవుతోందన్నారు. ఖైరతాబాద్‌లో 20 నిమిషాల్లో 9 సె.మీ కుపైగా వర్షపాతం నమోదైందన్నారు. హైదరాబాద్ లో ప్రస్తుతం కోటి మంది నివసిస్తున్నారన్నారు. మూసీ పరివాహక ప్రాంతం మురికికూపంలా మారిందని, దానిని మార్చాలన్నారు. మూసీకి వరదలు వస్తే ప్రజలే ఇబ్బంది పడతారన్నారు. మూసీ పరిధిలోని ఎమ్మెల్యేలను తీసుకొని క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్తామన్నారు.

## అర్బన్ నక్సల్స్ గుప్పిట కాంగ్రెస్

వివరించారు. జమ్మూకశ్మీర్‌లో మూడో విడత ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో శనివారం ప్రధాని మోదీ పర్యటించారు. జమ్మూ నడిబొడ్డున ఉన్న ఎమ్ఏఎమ్ స్టేడియంలో జరిగిన బీజేపీ ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎన్సీ కూటమి, పీడీపీ పార్టీలపై విరుచుకుపడ్డారు. కశ్మీర్ ప్రజలకు ఆ మూడు పార్టీలు అన్యాయం చేశాయన్నారు. అవి తమ కుటుంబాలకు మేలు చేసుకున్నాయేగానీ, అంతులేని బాధల్లో ఉన్న కశ్మీరీలను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. లోపాయికారీ కాంగ్రెస్ రాజకీయాలు, నిర్లక్ష్యమే కశ్మీరీలకు శాపాలుగా మారాయన్నారు. ''పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా జరిగిన మిలిటరీ సర్జికల్ స్ట్రైక్స్ విశ్వసనీయతను ప్రశ్నించే కాంగ్రెస్ ద్రోహాన్ని మరవగలమా? ఓటుబ్యాంకు కోసం విదేశీ చొరబాటుదారులకు కాంగ్రెస్ స్వాగతం పలుకుతోంది. సొంత ప్రజలను మాత్రం అవమానిస్తోంది'' అని దుయ్యబట్టారు. జమ్మూకశ్మీర్‌కు త్వరలోనే రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని మోదీ అన్నారు. బీజేపీకి మాత్రమే ఆ శక్తి ఉన్నదని స్పష్టం చేశారు. ''తమను గెలిపిస్తే పాత వ్యవస్థను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్‌ఎన్సీ, పీడీపీ చెబుతున్నాయి. బీజేపీకి అధికారం కట్టబెడితే మహిళా సాధికారికత కోసం పాటుపడతామని వివరించారు. ''స్వయం సహాయక గ్రూపులను ఏర్పాటుచేసి అక్కచెల్లెమ్మలను ధనవంతులను చేస్తాం. తగిన శిక్షణ ఇప్పించి డ్రోన్లను వారికి ఇప్పిస్తాం'' అని తెలిపారు.

## భగ్గుమన్న పశ్చిమాసియా

రివల్యూషనరీ గార్డ్ జనరల్ అబ్బాస్ నిల్ఫోరూషన్ కూడా మరణించారు. నస్రల్లా మరణంతో అప్రమత్తమైన ఇరాన్ తమ దేశ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని సురక్షిత ప్రాంతానికి తరలించింది. ఈ సందర్భంగా ముస్లింలంతా లెబనాన్‌కు, హెజ్బొల్లాకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. నస్రల్లా మృతిపై ఇరాన్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. లెబనాన్ దాడులతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో దేశవ్యాప్తంగా అదనపు బలగాలను మోహరిస్తున్నట్టు ఇజ్రాయెల్ అధికారులు చెప్పారు. శుక్రవారం ఐరాసలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రసంగించారు. లెబనాన్‌లో తమ లక్ష్యం నెరవేరే వరకు తమ దాడులు ఆగవని స్పష్టం చేశారు. కుడి చేతిలో నల్లని రంగుతో ఉన్న మ్యాప్‌లో మధ్య ప్రాచ్య దేశాలైన ఇరాన్, ఇరాక్, సిరియా, యెమన్ దేశాలు ఉండగా వాటికి ఆయన 'శాపం'గా పేర్కొన్నారు. అలాగే ఎడమ చేతిలో పచ్చ రంగుతో ఉన్న మ్యాప్‌లో భారత్, ఈజిప్ట్, సూడాన్, సౌదీ అరేబియా దేశాలు ఉండగా, వాటిని ఆయన 'దీవెన'గా తెలిపారు. అయితే రెండు మ్యాపుల్లో పాలస్తీనా ప్రస్తావన లేకపోవడం గమనార్హం. ఆయన ప్రస్తావిస్తూ ప్రస్తుతం పశ్చిమాసియాలోని సంఘర్షణ పరిస్థితులకు ఇరాన్, దాని మిత్ర దేశాలే కారణమని ఆరోపించారు. అదే సమయంలో పచ్చని రంగుతో ఉన్న 'దీవెన' దేశాల గురించి మాట్లాడుతూ అవన్నీ తమ మిత్ర, కాబోయే మిత్ర దేశాలుగా పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చి తప్పు చేశామా!?

- రేవంత్ రెడ్డి కంటే కేసీఆర్ నయం అంటున్న ప్రజల మాటల వెనుక ఆంతర్యం ఏమిటి!?
- తెలంగాణ రాష్ట్ర చరిత్రలో కాంగ్రెస్ పార్టీ అపనింద మూట కట్టుకుంటుందా!?
- హైడ్రా పని చేస్తుంది ఎవరి కొరకు!? భవిష్యత్తు కొరకైతే వర్తమానాన్ని పాడుచేయాల?
- రాజ్యాంగాన్ని అడ్డుపెట్టుకొని కూలుస్తూ ప్రజల సంక్షేమాన్ని అధికారులు పట్టించుకోరా!?
- పదేళ్లు తెలంగాణ రాష్ట్ర సమితికి అధికారం ఇస్తే అవినీతి, భూకబ్జాలు, ఎక్కువ అయ్యాయని దొర పాలనకు అంతం పలకాలని కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు హైడ్రా పేరుతో నానా హైరానా చేస్తూ పేద ప్రజల గుడిసెల్లో నిప్పులు పోస్తున్న వైనంపై "జయభేరి" కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ సమగ్ర రాజకీయ విశ్లేషణ...!







✍ కడారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత
గాయకులు, సామాజిక ఉద్యమకారులు

✍ **జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్రంలో మార్పు జరిగితే మంచి పాలన వస్తుందని అనుకొని నమ్మిన తెలంగాణ ప్రజలకు నిరాశే మిగిలిందా!? అంటే ఒక వైపు కాదని ఇంకో నాణెం వైపు అవుననే సమాధానాలు ఉత్పన్నమవుతాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 9 నెలల సమయంలో ఎలక్షన్ కోసం ఓ మూడు నెలలు బిజెపి పార్టీ తన సొంతం చేసుకొని తన రాజకీయ పలుకుబడిన పెంచుకొని తిరిగి అధికారంలోకి వచ్చింది. ఇక సమయాన్ని అడ్డం పెట్టుకొని గెలిచిన కాంగ్రెస్ పార్టీ సీఎం గారు రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన దగ్గర నుండి మాటల తూటాలు నిరసనలు సెగలు ఒక్కటి ఒక్కటి నిప్పు రాసుకుంటూనే ఉన్నాయి. అలవి గాని సంక్షేమ పథకాలను ప్రజలకు ఆశ చూపి ఫ్రీ బస్సు సౌకర్యాన్ని ఆడవారికి కల్పించి మగవాళ్ళ ఆత్మస్థైర్యం మీద దెబ్బ కొట్టారని ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో మగవారి సీట్లలో కూర్చొనియకుండా ఆడవాళ్లు వెనకనుంచి ముందు నుంచి ఎక్కడ చూసినా ఆడవాళ్లే అన్నట్టుగా బస్సు పూర్తిగా ఆడవాళ్ళకి పరిమితమైంది. ఇక ఈ ఫ్రీ బస్సు సౌకర్యంపై మగవాళ్ళ పెదవి విరుపు ఆర్టీసీ ఉద్యోగుల పెదవి విరుపు కాస్త శాపనార్థాలుగా మారే అవకాశం లేకపోలేదు. అంతేకాకుండా సంక్షేమ పథకాలు ప్రజలకు కనీస పనిని కల్పించి వారిని ఆర్థిక అభివృద్ధి దిశగా నడిపే ప్రయత్నానికి ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాలి. కానీ జరుగుతున్నది ఏంటి ఒకరు కొన్ని ఫ్రీ ఇస్తే మరొకరు అన్ని ఫ్రీ అంటూ ప్రజాస్వామ్య పాలనకు చెంపపెట్టు మాదిరిగా దేశ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తూట్లు పొడిచే ప్రయత్నాలకు ఎడపెడ వాగ్దానాలిస్తూ అధికారాన్ని దక్కించుకున్నారు. అంటే సంక్షేమ పథకాలు అందిస్తేనే ప్రజలు ఓట్లేశారా అని అనుమానం వద్దు. ఎందుకంటే తెలంగాణ ప్రజలు ఎంత బానిసత్వాన్ని అయినా భరిస్తారు కానీ పెత్తనం చేస్తే చీల్చి చెండాడే గుణం పోరాట స్ఫూర్తి ఈ తెలంగాణ మట్టిలోనే ఉంది. అందుకే గత ప్రభుత్వానికి చుక్కలు చూపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారాన్ని కట్టబెట్టారు. ఇక అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి ఈ మధ్యకాలంలో హైడ్రా పేరుతో అన్నందుకు ఒక నాగర్జున కన్వెన్షన్ హాల్ను కూల్చేసి ఆ తరువాత పేద గుడిసెలపై హైడ్రా పంచను విసిరాడు. ఇది ప్రతిపక్ష పార్టీలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితి శాసనసభ్యులకు ఒక ఆయుధంగా మారింది. దీనికి తోడు పేదలు నిర్భాగ్యులు మధ్యతరగతి ప్రజలు పైసా పైసా కూడబెట్టుకొని టాక్సీలు కట్టి రిజిస్ట్రేషన్ చేసుకొని నల్లా బిల్లు లైట్ బిల్లు వాటర్ బిల్లు ఇలా అన్ని బిల్లులు కట్టుకుంటూ పదేళ్లు, తెలంగాణ రాష్ట్ర సమితి పాలనలో మేం సుఖంగా ఉన్నాం అనేలా తెలంగాణ ప్రజల నుంచి ఆ మాటలను రాబట్టుకుంటున్న ప్రతిపక్ష పార్టీ ఇప్పుడు అధికార పార్టీకి చుక్కలు చూపించేందుకు ఒక రాజకీయ అస్త్రంగా మారుతుంది. నిజానికి హైడ్రా ఖచ్చితంగా పనిచేయాల్సిందే. కానీ పెద్ద పెద్ద వాళ్ళ ఇండ్లకు మాత్రం నోటీసులు కోర్టులో వేసే వరకు వేచి ఉండి వారిని ఏమనకుండా వారి ఇల్లు కూలగొట్టకుండా కేవలం దిగువ ఎగువ మధ్యతరగతి ప్రజల ఇళ్ళను కూలగొట్టడంపై ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఊగిపోతున్నారు.

**మేం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకుంది మా కొంపలు పూల్చడానికా అనే శాపనార్థాలు పెడుతున్నారు. కచ్చితంగా ఇది రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రధానాస్త్రంగా మారొచ్చు... వాస్తవానికి ఏళ్లకు ఏండ్లు తెలంగాణ ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకొని అన్ని టాక్సీలు కడుతూ కాపురం చేస్తున్న ఆ ఇంట్లో ఒక్కసారిగా హైడ్రా పేరుతో కూల్ చేయడం అసలు వెనుక కథ ఏంటి...!? బఫర్ జోనని ఎఫ్టీఎల్ జోనని అనేక పదాలను ప్రజలకు అర్థం కాని భాషలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ 2030 కల్లా హైదరాబాద్ను ప్రక్షాళన చేస్తూ 2026 వరకు మూసిలో నీళ్లు తాగడానికి కార్యాచరణ ఏర్పాటు జరగాలని అందుకే హైడ్రా పేరుతో బఫర్ జోన్ లో ఎఫ్టీఎల్ లో ఉన్న ఇళ్లను తొలగిస్తున్నామని చెబుతున్న మరి వాటికి పర్మిషన్ ఇచ్చింది ఎవరు? వాస్తవానికి పర్మిషన్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకొని టాక్సీలు తీసుకుంటున్న ఆనాటి ప్రభుత్వాలదే కదా ఈ తప్పు? దానికి ప్రజలను ఎందుకు ఇబ్బంది పెట్టాలి? సిగ్గులేని ప్రభుత్వాలు చేసిన పనులకు అమాయకులైన ప్రజలు బలవ్వాల? ఇక హైడ్రా కమిషనర్ మాట్లాడుతూ హైదరాబాదులో వరదలు రాకుండా చేయడానికి మూసి ప్రక్షాళన చేస్తున్నామని శుద్ధపూస మాటలు మాట్లాడుతున్న వాటికి పర్మిషన్ ఇచ్చిన అధికారులు ఆయా ప్రభుత్వాలను కదా నిందించాల్సింది శిక్షించాల్సింది? అని ప్రజాసంఘాల నేతలు దుమ్మెత్తి పోస్తున్నాయి!**

వీటికి తోడు ప్రతిపక్ష పార్టీలో ఉన్న తెలంగాణ రాష్ట్ర సమితి ఒక అడుగు ముందుకేస్తూ వారందరిని తెలంగాణ భవన్లో మీటింగ్ ఏర్పాటు చేయించి వారితో పాటు వారి లీగల్ టీం ను వారికి అప్పజెప్పి ప్రభుత్వంపై ఒక గట్టి లీగల్ పోరాటానికైతే సిద్ధం అవుతుంది. ఆదిలోనే హంసపాలు అన్నట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది ఒక పెద్ద మైనస్ పాయింట్ గా అభివర్ణించుకోవచ్చు. నిజానికి ప్రభుత్వం వస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇల్లు స్థాయి సంక్షేమ పథకాలు అందుతాయి పనులు జరుగుతాయి అని అనుకున్న అమాయకమైన ప్రజల ఇళ్లను కూల్ చేస్తుంటే ఏం మాట్లాడాడో తెలియక అక్రమ కట్టడం చేసిన వాళ్లు అనే ముద్రపడి ఇప్పటికే ఆత్మహత్య చేసుకున్న కుటుంబాల్లో ఆ విషాద ఛాయలు ఇంకా అలానే కనిపిస్తున్నాయి. ఒకనాడు తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు పోగొట్టుకుంటే నేడు మా కొంపలు కూల్చకండి అంటూ ప్రాణాలను తీసుకుంటున్న వైనం కాంగ్రెస్ పార్టీకి ఎంత మంచిది కాదు.

**ఎఫ్టీఎల్ బఫర్ జోన్లలో పర్మిషన్లు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసిన అధికారులను ఏం చేయాలి!? ఏ ప్రభుత్వాలు వచ్చినా ప్రజల సంక్షేమం గురించే ఆలోచన చేయాలి గాని సాధారణ మధ్యతరగతి ఎగో తరగతి ప్రజలను హింస పెట్టడమే ప్రధాన లక్ష్యమా? అంటే రాజకీయ నాయకులు అధికారులు బాగానే ఉంటారు కానీ ఓటేసి పన్నులు చెల్లిస్తూ గెలిపించిన ప్రజలు మాత్రం నడి బజార్లో ఇలా కన్నీటి శోకసముద్రమై తమ బతుకులను రోడ్డుపాలు చేసుకోవాల్సిందేనా? ఇది ముమ్మాటికి తప్పు! దీనిపై హైకోర్టు ఇప్పటికే హైడ్రా కమిషనర్ కు నోటీసులు అందజేసి వాతపెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెనకడుగు వేస్తోందా? ఒకవేళ వెనుకడుగు వేస్తే జరిగిపోయిన నష్టాన్ని ఎవరు పూర్తి చేయాలి?**

తెలంగాణ రాష్ట్రం ఎన్నో త్యాగాలు పోరాటాలు ఆత్మ బలిదానాల వల్ల రాష్ట్రం ఒక రూపాన్ని దిద్దుకుంటే ఆ రాష్ట్రంలో బ్రతుకుచిత్రం ఇవాళ పూర్తిగా చిన్నాభిన్నం అయిపోతుంది.. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ దిద్దుకోలేని తప్పు చేస్తుందని చెప్పక తప్పదు... ఒక్కో జిల్లా మంత్రి తమ ఎమ్మెల్యేలను తమ ఆధీనంలో పెట్టుకొని పెత్తనం చెలాయిస్తూ ఇసుకను తోడుకుపోతూనే ఉన్నారు... భూములను కబ్జా చేస్తూనే ఉన్నారు. అవి చాలదు అన్నట్టు ఇప్పుడు ఏకంగా హైడ్రా పేరుతో పూర్తిగా పేదల ఇళ్లను కూల్చేస్తూ వారికి కనీస సౌకర్యం కూడా కల్పించకుండా పిల్లల సర్టిఫికెట్లను కూడా తీసుకోకుండా చేస్తున్న ఇంత కిరాతకమైన పని ఇంకొకటి ఉందా!?

హైడ్రా చేసే పని మంచిదే కావచ్చు మూసికి వరద పోటీ అయితే అవకాశాలను కట్టడి చేయడానికి కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి నిజమే కానీ.. సాధారణ ప్రజలు ఏర్పాటు చేసుకున్న గూడును కూల్చేటప్పుడు వారికి వేరొక చోటును ఏర్పాటు చేసి వారికి ధైర్యం చెప్పాల్సింది పోయి రాత్రికి రాత్రే కూలగొట్టడం వెనక ఏంటి ఆంతర్యం!? హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాన కిషోర్ హైడ్రా కమిషనర్ రంగనాథ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారు కానీ ప్రజల సంక్షేమం ప్రజల కష్టం ఏ మాత్రం మాట్లాడటం లేదు. అంటే రాబోయే రోజుల్లో వరద తాకిడిని తట్టుకోవడానికి ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నాం అంటూ అధికారులను అడ్డంపెట్టి రాజకీయ నాయకులు ఆడుతున్న నాటకాలు ఏంటి? ప్రజలు నివసిస్తున్న ఇల్లు కూలగొట్టి పార్కులు అక్కడ కడతాము, వాడి చుట్టూ ఏ వ్యక్తికి అన్యాయం జరగనివ్వము అని చెప్తున్నా కలెక్టర్ ప్రజల కన్నీటి బాధను ఎలా తీరుస్తారు? రాజకీయ నాయకులు డబల్ బెడ్ రూములు కట్టిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా కనిపిస్తోంది. ఒకరా ఇద్దరా వేలకు వేల కుటుంబాలను చిన్నాభిన్నం చేసిన కాంగ్రెస్ పార్టీ కాలగర్భంలో ఒక పెద్ద తప్పును తెలంగాణ చరిత్రలో మూటగట్టుకోక తప్పదు.

**ఒకవైపు ఇల్లును కోల్పోయి బాధ తప్ప హృదయంతో మాట్లాడుతున్న ప్రజల మాటల్లో నిజాయితీ లేకపోలేదు.. మేము డబ్బులు కట్టి ప్రభుత్వంతో రిజిస్ట్రేషన్ చేసుకొని టాక్సులు కడుతున్నాం మమ్మల్ని ఆక్రమణదారులు అని ముద్ర వేసి సమాజంలో మమ్మల్ని ఒక నేరస్తులుగా నిలబెడుతున్నారనే వాదనను ఈ అధికారులు సమాధానాలు ఇస్తారా!? మొత్తానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక పెద్ద అపనిందను పెద్ద తప్పును అంటే సరిదిద్దుకోలేని తప్పులు చేస్తూ రాబోయే రోజుల్లో తెలంగాణను బాగు చేస్తామని చెబుతూ నేడు ప్రజలను నడి బజార్లు వారిని నిరాశ్రయులుగా చేస్తూ వారి కడుపు శోకాన్ని వారి ఉసురును పంచుకుంటున్నారు.. హైడ్రా చేసే పని మంచి పని అయినా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలక్కుండా వారికి అర్థమయ్యే రీతిగా చెబుతూ చట్టంపై గౌరవం పెంచే పనులే చేయాలి కానీ అధికారులు చట్టాన్ని అడ్డం పెట్టుకొని కబ్జాల పేరుతో వారిని నిరాశ్రయులుగా చేయడం వారిని నడి బజారులో నిలబెట్టడం వారి కలల గూడును నిర్దాక్షణంగా కూల్చే చేయడం అంతా ఏకపక్ష నిర్ణయంగా మారిపోతుందని ఆరోపణలు గట్టిగా మూట కట్టుకుంటుంది కాంగ్రెస్ ప్రభుత్వం. ఇదిలాగే కొనసాగితే రాబోయే సర్పంచ్ గ్రామీణ స్థాయిలో జరిగే ఎలక్షన్లు కాంగ్రెస్ పార్టీ కచ్చితంగా ఓటమి తప్పదు.**

ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ హైడ్రా విషయంలో ఒక అడుగు ముందుకేసి ఆలోచించి పేద ప్రజలకు నష్టం కలగకుండా వారికి మరొక గూడును కల్పించి హైడ్రాను ముందుకు తీసుకెళ్లాల్సిందిగా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# జిల్లా స్థాయిలో దేవరకొండ విద్యార్థులకు ద్వితీయ బహుమతి

- జానపద నృత్య పోటీలో దేవరకొండ గురుకుల డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయి ద్వితీయ బహుమతి
- ఒకవైపు ప్రభుత్వ కళాశాలలో చదువుతూ, ప్రతిభ చాటిన విద్యార్థులను
- విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచేలా ప్రోత్సాహించాలి

✍ **జయభేరి, దేవరకొండ :**



మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జానపద నృత్య పోటీలో దేవరకొండ గురుకుల డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థులు జిల్లాస్థాయి ద్వితీయ బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.శ్వేతా తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎన్. శ్వేతా మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ ప్రోత్సాహం అనేది ఎంతో బలాన్ని ఇస్తుందని, మరిన్ని విజయాలు సాధించాలనే లక్ష్యాన్ని నిర్దేశిస్తుందని, వారు జీవితంతో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు సాయపడుతుందని తెలిపారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సాహించాలని వారు తెలిపారు. ఈ బహుమతిని మైనారిటీ ఆర్ ఎల్ సి విష్ణుమూర్తి గౌడ్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి జానపద నృత్య పోటీలో ద్వితీయ బహుమతి పొందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థినులకు కళాశాల ప్రిన్సిపల్ ఎన్.శ్వేత యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎ. శ్యామల, ఎ.మీనేశ్వరి, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

# డిజిటల్ క్రాప్ సర్వే అమలు



జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ నాన్ గెజిటెడ్ కేంద్ర సంఘం హైదరాబాదు కార్యాలయంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, తెలంగాణ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ అధ్యక్షతన శనివారం తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారు సెంట్రల్ ఫోరం కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న డిజిటల్ క్రాఫ్ సర్వేలో ఏఈఓలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మరియు ఇతర సమస్యల గురించి సుదీర్ఘంగా చర్చించడం జరిగింది వివిధ రాష్ట్రాలలో డిజిటల్ క్రాప్ సర్వే అమలు చేస్తున్న విధానం కాకుండా మన రాష్ట్రంలో ఏఈఓలను పూర్తి బాధ్యుల్ని చేస్తూ ఒక యాప్ డెవలప్ చేసి దానిని ఏఈఓ లందరినీ తమ వ్యక్తిగత చరవనులలో డౌన్లోడ్ చేసుకొని సర్వే చేపట్టాలని లేనిపక్షంలో ఉన్నతాధికారులు జిల్లా అధికారుల ద్వారా ఏఈఓల భయభ్రాంతులకు గురిచేస్తూ యాప్ డౌన్లోడ్ చేసుకోని వారికి విధి నిర్వహణలో ఉన్నప్పటికీ ఉద్యోగానికి హాజరుకానట్టు సెలవు పరిగణిస్తామని ఒత్తిడి చేస్తున్నారు. డిజిటల్ క్రాఫ్ సర్వే ప్రభుత్వం వ్యవసాయ శాఖ పైలెట్ ప్రాజెక్టుగా గత సంవత్సరము వాన కాలము, యాసంగి లో 17 జిల్లాలలో 17 మండలాలను ఎంపిక చేసి చేపట్టడం జరిగింది. ఆ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి సర్వే నెంబరు ప్రతి సబ్ డివిజన్ లో వేసిన పంట యొక్క వివరాలను ఫోటోతో సహా యాప్ లో అప్లోడ్ చేయవలసి ఉంటుంది. సర్వే నంబర్ను ఐడిటిఫికేషన్ చేసినప్పటికీ కూడా అందులో ఉన్న సబ్ డివిజన్లను మనము ఐడెంటిఫై చేయలేము. దీనివల్ల రైతు వేసిన పంట వివరాలను తప్పుగా నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఈ విధంగా చేయుట రోజుకు ఒక మనిషి 50 ఫోటోలను చిత్రంచగలిగారు. ఈ విషయాన్ని గమనించిన అధికారు పంటకాలం అయిపోయే లో ఈ నమోదును పూర్తి చేయాలి. కాబట్టి ఇతర మండలాల ఏఈఓ లను డిప్యూట్ చేసి చేయించినప్పటికీ కూడా రెండు నెలల సమయంలో పూర్తి చేయడం జరిగింది. ఉదాహరణకు నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల జానకంపేట క్లస్టర్లో పైలట్ ప్రాజెక్టు కింద చేసినప్పుడు 10470 ఫార్మ్స్ చిత్రాలు తీయడానికి కి ఐదుగురు ఏ ఈ ఓ లు 90 రోజుల సమయాన్ని వెచ్చించడం జరిగింది. అది కూడా ఒకే రకమైన పంట ఉన్నది. అదే ఒక్క ఏఈఓ మాత్రమే ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో చేయాలంటే 455 రోజులు సమయం పడుతుంది. ఇతర రాష్ట్రాలు అయిన కర్ణాటక లో ప్రైవేటు రెసిడెంట్స్ పేరిట స్థానిక యువకులను నియమించుకొని సర్వే చేయిస్తుంది. ఇందుకుగాను ప్రతి ఫార్మ్ కి రూపాయలు 10 కేంద్ర బడ్జెట్ నుండి చెల్లిస్తున్నారు. మహారాష్ట్రలో అక్కడి ప్రభుత్వం ఈ పిక్ పహాని పేరిట విజయవంతంగా అమలు చేస్తున్నారు. మన పక్క రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ vaa విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ల ద్వారా ఒక్కొక్కరి 1000 ఎకరాలు పరిమితితో చేయిస్తున్నారు. రాష్ట్రంలో 2604 రైతు వేదికలు గత ప్రభుత్వం రైతుల సమావేశాలు శిక్షణకు నిర్మించడం జరిగింది. వాటి నిర్వహణకు నెలకు తొమ్మిది వేల రూపాయల చొప్పు నిర్వహణ ఖర్చులను ఇస్తామని హామీ ఇచ్చి కేవలం 5 నెలల మాత్రమే చెల్లించారు. ఇంకా ఒక్కొక్క రైతు వేదికకు 216000 విడుదల కాకపోవడంతో ఏ ఈ ఓ లు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. పై విషయాలన్నిటినీ పరిగణలో తీసుకొని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి డిజిటల్ క్రాఫ్ సర్వే యాప్ పై ఎక్స్పర్ట్ కమిటీని నియమించి ఇట్టి కమిటీలో వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం నాయకులను మెంబర్స్ గా పరిగనిస్తూ కమిటీ నివేదిక ద్వారా ఇటు రైతులకు ఏ ఈ ఓ లకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునే విధంగా DCS అమలుపై సమీక్షించి నిర్ణయం తీసుకోగలరని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, తెలంగాణ ఎన్జీవోల కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ తెలిపారు. పై సమస్యలన్నింటినీ కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్రంలోని ఏఈవోలెవ్వరు కూడా అధైర్య పడవద్దని యావత్ తెలంగాణ ఉద్యోగుల జేఏసి మీ వెన్నంటే ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు డి శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి కే సురేష్ రెడ్డి, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొనడం జరిగింది.



## మహిళ అదృశ్యం

జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 28:

గౌరవరం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపిన ప్రకారం మూడు నెలల క్రితం వనపర్తి జిల్లాకు చెందిన వడ్డే కిష్టయ్య తన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి వర్గల్ లోని ఐస్క్రీం కంపెనీలో పనిచేస్తూ అక్కడే జీవనం కొనసాగిస్తున్నారు. శుక్రవారం కిష్టయ్య అతని భార్య పనికి వెళ్లి సాయంత్రం వచ్చేసరికి తన కూతురు జయలక్ష్మి (18) కనిపించలేదు. చుట్టూ ప్రక్కల వెతికిన ఆచూకీ లభించకపోవడంతో గౌరారం పోలీస్ స్టేషన్లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## బూరుగు పెద్ద మల్లయ్య విగ్రహం ఆవిష్కరణ



జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండలం నెల్వలపల్లి గ్రామంలో బూరుగు పెద్ద మల్లయ్య విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బూరుగు పెద్ద మల్లయ్య చేసిన సేవలు చిరస్మరణీయం అని ఆయన అన్నారు.బూరుగు పెద్ద మల్లయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, మాజీ రైతు బంధు అధ్యక్షుడు ఉజ్జిని విద్యాసాగర్ రావు, బిఆర్ఎస్ నాయకులు కుంభం శ్రీశైలం గౌడ్, రమావత్ తులిసిరామ్ నాయక్, తీదేడు గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సోనగంటి గోవర్ధనాచారి, సోసైటి డైరెక్టర్ తిరుమణి పాపయ్య, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, మర్రు రామారావు, చింతపల్లి మండలం యూత్ అధ్యక్షులు శిమర్ల శ్రీను యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయంగా మహిళలను చైతన్య పరుస్తా...

- తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం(TPPS )రాజకీయ విభాగం ప్రధాన కార్యదర్శిగా బొమ్మ ప్రవల్లిక నియామకం



జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 28 :

తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర రాజకీయ విభాగ ప్రధాన కార్యదర్శిగా బొమ్మ ప్రవల్లిక నేత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కమర్తపు మురళి, మాచర్ల రామచంద్రం, అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్ష కార్యదర్శులు కందగట్ల స్వామి, గడ్డం జగన్నాథం, రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షులు బొల్ల శివశంకర్ ల చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బొమ్మ ప్రవల్లిక నేత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని పద్మశాలి మహిళలను చైతన్యవంతం చేసి వారిని రాజకీయంగా తమ సత్తా చాటే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు, పద్మశాలీలు రాజకీయంగా ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారని విద్యాపరంగా ఉద్యోగ పరంగా మొదటి స్థానంలో ఉన్నారని, రాజకీయపరంగా కూడా మొదటి స్థానం తీసుకొచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. నేడు మహిళలు అన్ని రంగాలలో పురుషులకు దీటుగా ప్రతి ఒక్క రంగంలో తమ ప్రతిభ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఉన్నత స్థానంలో గౌరవింపబడుతున్నారని ఆమె పేర్కొన్నారు రాజకీయపరంగా కూడా మహిళలను చైతన్యవంతులను చేసి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో పర్యటనలు చేపట్టి రాజకీయంగా మహిళలను అసెంబ్లీలలో పార్లమెంటులో ఎంపీ ఎమ్మెల్యేలుగా పోటీ చేయించే స్థితికి తీసుకొచ్చి పద్మశాలీ మహిళల విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చేందుకు అనునిత్యం కృషి చేస్తానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లలో బీసీ పద్మశాలి మహిళలు పోటీచేసి గెలిపించేందుకు పద్మశాలి కుటుంబ సభ్యులంతా నిరంతరం కృషిచేసి పద్మశాలీల సత్తా నిరూపిద్దాం అని పద్మశాలి సమాజానికి పిలుపునిచ్చారు. తనను నమ్మి పదవి అప్పగించిన పద్మశాలి పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పద్మశాలీ మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెడతానని ఆమె పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో, చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు కందగట్ల బిక్షపతి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి జిల్లా నరేందర్, అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ నాయకురాలు బిళ్ళ దీపిక, మహిళా నేతలు చింతకింది అనురాధ, రోజా, శ్రీకాంత్, మాదాసు ప్రశాంత్, బొమ్మ అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.


## పేదల ఇండ్ల జోలికొస్తే సహించేది లేదు

- నారాయణ చెరువును పరిశీలించిన ఎంపీ ఈటల



జయభేరి, మేడ్చల్ :

తెలంగాణలోని పేద ప్రజలు నిత్యం కన్నీళ్లు పెట్టుకుంటేనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిద్రపట్టేట్టు ఉందని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిదిలోని నారాయణ చెరువు ఎఫ్.టి.ఎల్ ప్రాంతాన్ని ఎంపీ ఈటల పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ చెరువు ముంపు బాధితులతో మాట్లాడారు. ఎవరు అధైర్యపడవద్దని బాధితులకు భరోసా కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలను కన్నీరు పెట్టిస్తుందన్నారు. హైదరాబాద్ ప్రజలకు కంటినిండా నిద్ర లేకుండా రాష్ట్రా ప్రభుత్వం చేస్తుందని, ఎప్పుడు ఎక్కడ హైడ్రా బుల్డోజర్లు వస్తాయో అని పేద ప్రజలు బిక్కుబిక్కుమంటూ బ్రతుకుతున్నారని ఈటల తెలిపారు. గుండ్లపోచంపల్లి నారాయణ చెరువు ప్రాంతంలో ఉండే ప్రజలందరూ 30 సంవత్సరాల క్రితం ఇక్కడ వచ్చి 100 గజాల చొప్పున ప్లాట్లను కొనుకున్నారన్నారు.



గతంలో రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పథకంలో డబ్బులు వచ్చాయని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం అదే కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పేద ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. హైడ్రా భయానికి కూకట్ పల్లి లో బుచ్చమ్మ అనే మహిళ మృతి చెందిందని ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్య అని ఈటల విమర్శించారు. ఇలాంటి చర్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, నాయకులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్, అమరం సరస్వతీ, మున్సిపల్ అధ్యక్షుడు ఉషిగారి శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## నాగారం మాస్టర్ మైండ్ స్కూల్కు దక్కిన అరుదైన గౌరవం

- రాష్ట్ర ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ విద్యా రంగానికి గౌరవ సన్మానం
- నాగారం మాస్టర్ మైండ్ స్కూల్ ఉపాధ్యాయులకు దక్కిన గౌరవం

జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఈసీఐఎల్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు టీచర్స్ మరియు లెక్చరర్స్ విద్యా రంగానికి సంబంధించి జరిగిన గౌరవ సన్మానంలో ద మాస్టర్ మైండ్ స్కూల్ నాగారం అరుదైన గౌరవనీ దక్కించుకుంది. ఈ గౌరవ సన్మానంలో భాగంగా మాస్టర్ మైండ్ స్కూల్ నాగారం ప్రిన్సిపల్ కృష్ణవేణి ఉపాధ్యాయురాలు అలివేలు మంగ రజిని స్వప్న ఉపాధ్యాయురాళ్ల యొక్క కృషి అమోఘమని వారి యొక్క నిరంతర కృషి అందరికీ ఆదర్శ దాయకమని కొనియాడుతూ వీరికి గౌరవ సత్కారాన్ని ఈ సభలో అందించారు. ఈ సభలో గౌరవ జస్టిస్ చంద్రకుమార్ కీసర మండల విద్యాధికారి శశిధర్ ఉప్పల్ మండల విద్యాధికారి రామారావు లతోపాటు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బోడుప్పల్ అభివృద్ధి లక్ష్యంగా..



జయభేరి, మేడిపల్లి :

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1.71 కోటి డెబై ఒకటి లక్షల నిధులతో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు చేసిన మేయర్ అజయ్ కుమార్ యాదవ్. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో శనివారం 23వ డివిజన్ లో నందలి మల్లయ్య నగర్ నాలా నుండి వాసవి నగర్ వరకు సిసి రోడ్డు నిర్మాణం.. 1వ డివిజన్ నందలి క్రాంతి కాలనీ రోడ్ నెం. నుండి ద్వారకా నగర్ వరకు డ్రైనేజీ నిర్మాణం.. 3వ డివిజన్ లోని జిజి గార్డెన్ ఎదురుగా నుండి హరిత హరమ్ కాలనీ గణేష్ మండపం వరకు సిసి రోడ్డు, ఫ్యూషన్ జిమ్ నుండి ఆర్టీసీ కాలనీ వాటర్ ట్యాంక్ వరకు సిసి రోడ్డు నిర్మాణం.. 3, 4వ డివిజన్ లో శుభోదయ కాలనీ మెయిన్ రోడ్ నుండి కృష్ణ నగర్ వరకు సిసి రోడ్ నిర్మాణం.. 4వ డివిజన్ లో అనఘపురి కాలనీ రోడ్ నెం. 4 లోని ప్లాట్ నెం. 17 ధర్మారెడ్డి ఇంటి నుండి శ్రీరాములు ఇంటి వరకు.. వివేక్ నగర్ కాలనీ లో డ్రైనేజీ, లెక్చరర్స్ కాలనీ మెయిన్ రోడ్ నుండి అకాడమీ హైట్స్ స్కూల్, వివేకానంద కాలనీ స్ట్రీట్ నెం. 4&6, శ్రీ లక్ష్మి నగర్ కాలనీ డిజిపి ఆఫీస్ నుండి ఎక్స్టెన్షన్ రోడ్ వరకు, శివ గణేష్ కిరణం నుండి చివరి వరకు సిసి రోడ్ నిర్మాణ శంకుస్థాపనలు జరిగినవి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్ గౌడ్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, కమీషనర్, కార్పొరేటర్లు రాసాల వెంకటేష్ యాదవ్, బొమ్మక్ కళ్యాణ్, చందర్ గౌడ్, పద్మారెడ్డి, బింగి జంగయ్య యాదవ్, సుమన్ నాయక్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దాసర్లపల్లిలో సివిల్ రైట్స్ డే



జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 28 :

దాసర్లపల్లి గ్రామంలో సివిల్ రైట్స్ డే సందర్భంగా ములుగు ఎస్సై సిహెచ్ విజయ్ కుమార్ ములుగు ఎమ్మార్వో ప్రవీణ్ రెడ్డి, ములుగు ఎంపీఓ సమక్షంలో దాసర్లపల్లి గ్రామంలో కులాలకు మతాలకు అతీతంగా గ్రామస్తులతో సివిల్ రైట్స్ డే సందర్భంగా మీటింగ్ నిర్వహించారు.ఈ సమావేశానికి గ్రామ మాజీ సర్పంచ్ మాజీ ఉప సర్పంచ్, కుల, మత పెద్దలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు. ఇటీవల గ్రామంలో జరిగిన వినాయక నిమర్జన సమయంలో జరిగిన గొడవను పురస్కరించుకొని, మతాలకు కులాలకు అతీతంగా ఉండాలని ఎవరు ఎవరిని కించపరచకుండా ఉండాలని ఎస్సై విజయ్ కుమార్, ఎమ్మార్వో ప్రవీణ్ రెడ్డి, ఎంపీవో తెలిపారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి



జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 28 :

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని మాజీ ఎఫ్డిసి వంటేరు ప్రతాప్ రెడ్డి, సిద్దిపేట జిల్లా బేస్బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నిమ్మ రంగారెడ్డి తెలిపారు. వర్గల్ మండలం వేలూరు గ్రామంలో గతవారం రోజుల నుండి తెలంగాణ బేస్బాల్ శిక్షణ శిబిరం ముగుస్తున్నందున కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుందని తెలిపారు. ఈ క్రీడల్లో సెలెక్ట్ అయిన క్రీడాకారులను పంజాబ్ లో ఆడేందుకు అవకాశం ఉందని సిద్దిపేట్ జిల్లా బేస్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పాపిరెడ్డి, వెంకటేశ్వర గౌడ్, ఆర్గనైజర్ సెక్రెటరీ ప్రవీణ్ గౌడ్, తెలంగాణ బేస్బాల్ సెక్రటరీ శ్వేత, ట్రెజరర్ కృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.



# నెట్ చీర కట్టేటప్పుడు

## తీసుకోవాల్సని జాగ్రత్తలు

నెట్ చీర కట్టుకునేటప్పుడు కొన్ని విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి. లేదంటే లుక్ మొత్తం పాడైపోతుంది. పెటికోట్ ఎంచుకోవడం నుంచి ఫాల్ వరకు ఈ టిప్స్ తెల్సుకోండి.

చీరలో ప్రతి ఆడపిల్ల అందంగా కనిపిస్తుంది. కానీ చీరకట్టు సరిగ్గా ఉంటే అందం రెట్టింపు అవుతుంది. చీరల్లో బోలెడు రకాలుంటాయి. షిఫాన్, నెట్, జార్జెట్, సిల్క్ కాకుండా ఎన్నో రకాలు ఉన్నాయి. అన్ని రకాల చీరలు కట్టుకోవడం కష్టమేం కాదు. కానీ పారదర్శకంగా ఉండేవీ, చాలా తేలిగ్గా ఉండే నెట్ చీరలు కట్టడం మాత్రం సవాలే. ఈ చీరలు కట్టేటప్పుడు కొన్ని తప్పులు చేస్తే చీర అందం పోతుంది. చూడ్డానికీ చాలా ఎబ్బెట్టుగానూ ఉంటుంది. నెట్ చీర కట్టేటప్పుడు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో చూడండి.

**పెటికోట్:**
నెట్ చీర లాంటివి పూర్తిగా పారదర్శకంగా ఉంటాయి కాబట్టి పెటికోట్ గురించి ప్రత్యేకంగా ఆలోచించాల్సిందే. కేవలం రంగొక్కటి నప్పితే సరిపోదు. కాటన్ పెటికోట్స్ ఈ చీరలకు అస్సలు బాగుండవు. బదులుగా మెటాలిక్ రంగులు, శాటిన్ సిల్క్ ఫ్యాబ్రిక్ పెటికోట్స్ ఎంచుకోండి. చీర అందం పెరుగుతుంది. ఒకసారి దానిమీద చీర పెట్టి చూశారంటే మీకో అవగాహన వస్తుంది. సౌకర్యంగానూ ఉంటుంది.

**పెటికోట్ పొడవు:**
సరైన ఫ్యాబ్రిక్ తో పాటు పెటికోట్ పొడవును కూడా దృష్టిలో ఉంచుకోవాలి. పాదాలకు మించి పొడవు ఉంటే చీరకట్టు అందంగా కనిపించదు. పెటికోట్ పొడవు సరిగ్గా మడమ దాటి ఉండాలి. దాంతో పెటికోట్ కు, చీరకు మధ్య గ్యాప్ కనిపించదు. పెటికోట్ పొడవు తక్కువగా ఉంటే మధ్యలో నుంచి పాదాలు కనిపించి సౌకర్యంగా అనిపించదు.

**బార్డర్‌కు తగ్గ ఫాల్:**
నెట్ చీరలకు సాధారణంగా బార్డర్ దగ్గర ఎంబ్రాయిడరీ ఉంటుంది. మీరు ఎంచుకునే ఫాల్ అదే వెడల్పుతో ఉండాలి. పెద్ద ఫాల్ వేయిస్తే అది బయటకు కనిపిస్తుంది. చీర లుక్ మొత్తం పాడవుతుంది.

**నాడలు:**
మీరు నెట్ చీర కింద పెటికోట్ వేసుకున్నప్పుడు దాన్ని ఎలా కట్టుకుంటున్నారో కూడా ముఖ్యమే. చాలా మంది పెటికోట్ ఒక వైపుకు కట్టేస్తారు. దాంతో చీర నుంచి నాడలు బయటకు కనిపిస్తాయి. అందుకే నెట్ చీర కట్టేటప్పుడు మాత్ర చీర నాడలు మధ్యలో ముందువైపు కట్టుకోండి. పెటికోట్ దారాలు అస్సలు కనిపించవు.

**బ్లవుజు డిజైనింగ్:**
నెట్ చీర కోసం బ్లవుజ్ డిజైన్ చేసేటప్పుడు హుక్స్ ముందు వైపు పెట్టించుకోకండి. సైడ్ జిప్ లేదా బ్యాక్ హుక్స్ పెట్టించుకుంటే మంచిది. ఈ చీరలు పారదర్శకంగా ఉంటాయి కాబట్టి ఈ ట్రిక్ పని చేస్తుంది. దాంతో ముందు వైపు సింగిల్ పొరలో కొంగు వేసుకున్నా అందంగా కనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే బ్లవుజ్ డిజైన్ క్రాప్ టాప్ లాగా లేదా లెహెంగా మీద బ్లవుజు లాగా కాస్త పొడవుగా కుట్టించుకుంటే ఈ చీరలకు మంచి లుక్ వస్తుంది.





# చర్మం చేసే పనులు ఏమిటో తెలుసా?

మానవ శరీరంలో అతిపెద్ద అవయవం చర్మమే... వినడానికి ఆశ్చర్యంగా ఉన్న గుండె, కాలేయం, ఊపిరితిత్తులలాగే చర్మం కూడా ఒక అవయవమే. అలాంటి ఈ అవయవం చేసే పనులు తెలిస్తే ఆశ్చర్య పోవాల్సిందే.

మనిషి శరీరం మొత్తం మీద ఉన్న చర్మాన్ని బరువు తూకం వేస్తే అది 2.7 కిలోల నుంచి 4.5 కిలోల బరువుంటుందని ఓ అంచనా. చర్మం సగటు బరువు 3 కిలోలు ఉంటుంది. చర్మం బరువు శరీరం బరువులో 15 వ వంతు ఉంటుంది. శరీరం మీదున్న చర్మం వైశాల్యం 25 చదరపు అడుగులు ఉంటుంది. ఒక చదరపు అంగుళం చర్మంలో 645 స్వేద గ్రంథులు, 196 అడుగుల రక్తనాళాలు, 77 అడుగుల నాడులుంటాయి. ప్రతి గంటకు ఆరు లక్షల చర్మకణాలు మానవ దేహ విసర్జిస్తుంది. జీవిత కాలంలో సగటున 180 కిలో గ్రాముల బరువుండే చర్మ కణాలు దేహం నుంచి రాలిపోతాయి. చర్మంలోని కణాలు 50 రోజులకొకసారి రాలిపోయి కొత్త కణాలు పుడుతుంటాయి. చర్మంలో ఫైబ్రోబ్లాస్టు, కెరటినోసైట్స్ అనే రెండు రకాల చర్మ కణాలుంటాయి. 6.5 అంగుళాల చదరపు వైశాల్యం గల చర్మంలో అనేక సూక్ష్మ రక్తనాళాలు, 65 దాకా వెంట్రుకలు, 100 దాకా నూనె గ్రంథులు, 650 దాకా స్వేద గ్రంథులు, లెక్కలేనన్ని నాడులు ఉంటాయని ఓ అంచనా!

**చర్మం నిర్మాణం**
దేహంపై భాగంలో చర్మం రెండు పొరలతో నిర్మించబడి ఉంది. చర్మంపై భాగాన్ని "ఎపిడెర్మిస్" అనీ, లోపలి భాగాన్ని "డెర్మిస్" అంటారు. మనం చూసే చర్మం కేవలం చర్మం యొక్క ఉపరితల భాగం మాత్రమే. శరీరంలో ఒక్కొక్క భాగంలో ఒక్కొక్క ప్రత్యేకత కలిగిన చర్మం ఉన్నప్పటికీ అధిక శాతం ఒకే మందం ఉంటుంది. చర్మం మందం ఒక్కో ప్రదేశంలో ఒక్కోరకంగా ఉంటుంది. కనురెప్పల మీద అతి పల్చగాను, అరికాలు, అరి చేతుల్లో అతి మందంగాను ఉంటుంది. చర్మంను స్థూలంగా 3 పొరలుగా విభజించవచ్చు.

**1. ఎపిడెర్మిస్:** ఎపిడెర్మిస్లో క్రింది వైపున ఉండే కణాలు నిరంతరం కొత్త కణాలను ఉత్పత్తి చేస్తూనే ఉంటాయి. క్రింది వైపున కొత్త కణాలు పుట్టేకొద్దీ పైవైపు కణాలు నశించి రాలిపోతుంటాయి. ఎపిడెర్మిస్ ఎలాంటి రక్తనాళాలు ఉండవు. డెర్మిస్ నుంచి ఎపిడెర్మిస్కి పోషక పదార్థాలు అందుతూ ఉంటాయి. ఎపిడెర్మిస్లో నాడులు ఉండవు కాబట్టి స్పర్శజ్ఞానం ఉండదు.

**2. డెర్మిస్:** చర్మంలో డెర్మిస్ అనేది ముఖ్యమైన పొర. దీనిలోనే రక్తనాళాలు, గ్రంథులు, వెంట్రుకల కుదుళ్ళు మొదలైనవి. అన్నీ ఉంటాయి. డెర్మిస్లో సాగి ముడుచుకుపోయే "ఎలాస్టిక్ ఫైబర్స్" ఉంటాయి. డెర్మిస్ ఎపిడెర్మిస్ కంటే 4 రెట్లు ఎక్కువ మంగంలో ఉంటుంది. డెర్మిస్ పొర "కొల్లాజిన్" అనే "ఫైట్రస్ ప్రొటీన్" తోను, "ఎలాస్టిన్" అనే మరో ప్రొటీన్తోను తయారై ఉంటుంది. డెర్మిస్లో కొన్ని మిలియన్ల స్వేర గ్రంథులు స్వేదాన్ని తయారుచేసి చర్మం ఉపరితలానికి పంపిస్తుంటాయి.

**చర్మవ్యాధులు**
**3. సబ్ క్యుటేనియస్ కణజాలం:** చర్మంలో ఎన్నో రకాల జీవకణాలున్నట్లే "మెలనోసైట్లు" అనే జీవకణాలున్నాయి. చర్మానికి రంగునిచ్చే "మెలనిన్" అనే పదార్థాన్ని ఈ మెలనోసైట్లు తయారు చేస్తాయి.

**చర్మం చేసే పనులు ఏమిటో తెలుసా**
- శరీరం మొత్తాన్నీ కప్పుతూ లోపలి అవయవాలన్నిటినీ వాటి వాటి నిర్ణీత స్థానాల్లో ఉంచి, వత్తిడి నుంచి, దెబ్బల నుంచి, రకరకాల భౌతిక, రసాయనిక పదార్థాల నుంచి చర్మం రక్షిస్తుంది.
- శరీరం లోపలున్న నీటిని అవసరానికి మించి బయటకు పోకుండా కాపాడుతుంది.
- శరీర ఉష్ణోగ్రతను ఒక నిర్ణీత స్థానంలో ఉంచుతుంది.
- స్పర్శా జ్ఞానాన్నిస్తుంది.
- చర్మం సాగి ముడుచుకుపోయే గుణాన్ని కలిగి ఉంటుంది.
- చర్మంలో ఉండే స్వే గ్రంథులూ, సున్నితమైన రక్తనాళాలూ కలిసి మలిన పదార్థాలను స్వేదం రూపంలో విసర్జించటం లాంటి కొన్ని విధులను నిర్వర్తిస్తాయి.
- చర్మం శరీరానికి ఆకృతిని కలిగిస్తుంది. వెంట్రుకల పెరుగుదలకు దోహదపడుతుంది.
- దీనికి రక్షణనిచ్చే వాటర్ ప్రూఫ్ గుణం ఉంది.
- హాని కలిగించే క్రిములను లోనికి ప్రవేశించకుండా కాపాడుతుంది.
- సూర్యరశ్మి నుంచి అల్ట్రా వయొలెట్ కిరణాలను గ్రహించి విటమిన్ "డి" ని తయారుచేసి శరీరానికందిస్తుంది.

**చెమట గ్రంథులు**
చర్మం కూడా ఒక విసర్జకావయవంగా పనిచేస్తుంది. శరీరంలోని మలిన పదార్థాలని "స్వేదం" లేదా "చెమట" ద్వారా బయటకు పంపుతుంది. శరీరం నుండి రోజుకి మన కంటికి కనిపించకుండా లీటరు పైగా స్వేదం వెలువడుతుంది. వేసవి కాలంలో ఎక్కువ చెమట పోస్తుంది. ఎప్పటి చెమట అప్పుడే ఆవిరయిపోవటం వలన మనకి అంత పరిమాణంలో కన్పించదు. చర్మమంతా పరుచుకొని 3.5 మిలియన్ల స్వేద గ్రంథులున్నాయి. స్వేద గ్రంథులు ఎక్కువగా చంకలలో మలద్వారం, జననాంగాలు వుండే చోట ఎక్కువగా వుంటాయి. చెమట గ్రంథులలో ఎండోక్రైన్ గ్రంథులు, అపోక్రిన్ గ్రంథులు ఉంటాయి. "ఎపోక్రైన్" గ్రంథులు శరీరమంతటా ఉండి చెమటను తయారుచేస్తూ ఉంటాయి. అరిచేతులు, పాదాల అడుగునా, తలపైనా ఎక్కువ ఉంటాయి. భావోద్రేకం వలన, శరీర ఉపరితలంపై ఉండే ఉష్ణోగ్రత వల్ల ఇవి ప్రేరేపణకు గురవుతాయి.



# మహిళల వ్యక్తిగత పరిశుభ్రత

మహిళల జననేంద్రియాల్లో శుభ్రత అత్యవసరం. దీనికోసం కొన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ఇన్ఫెక్షన్లు, ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టేస్తాయి.

మహిళల జననేంద్రియ భాగాల్లో పరిశుభ్రత గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. లేదంటే అజాగ్రత్త వల్ల అనేక రకాల వ్యాధులు, ఇన్ఫెక్షన్లు మొదలవుతాయి.
అందుకే ప్రైవేట్ భాగాల్ని, చుట్టూ చర్మాన్ని పూర్తిగా శుభ్రంగా ఉంచడం చాలా ముఖ్యం. అయితే ఈ సున్నిత ప్రాంతాల్ని శుభ్రం చేయడంలో అనేక అపోహలుంటాయి.
కాబట్టి ఆ భాగాల్లో శుభ్రత కోసం పాటించాల్సిన జాగ్రత్తలు తెల్సుకోండి.

**కాటన్ అండర్‌వేర్:**
జననేంద్రియాల దగ్గర చర్మం శుభ్రంగా, పొడిగా, బ్యాక్టీరియాకు దూరంగా ఉంచాలనుకుంటే కాటన్ ప్యాంటీలు ఉత్తమం. అయితే సాధారణ ప్యాంటీల కన్నా బాక్సర్ బ్రీఫ్స్ వాడితే అత్యంత సౌకర్యంగా ఉండటంతో పాటూ.. పరిశుభ్రంగా ఉంచడం సాధ్యపడుతుంది. ఎట్టిపరిస్థితుల్లోనూ లేసులు, నైలాన్, లేదా ఇతర వస్త్రాలతో చేసిన లోదుస్తులు ధరించకూడదు. ఇవి తడిని సమర్థవంతంగా పీల్చవు. తేమ చేరి బ్యాక్టీరియా ఎదుగుదలకు కారణం అవుతాయి.

**ప్యాంటీ లేకుండా:**
మహిళలు ప్రతిరోజూ 24 గంటల పాటు లోదుస్తులు ధరించాల్సి వస్తుంది. సౌకర్యం కోసం ఇది తప్పదు. అయితే పీరియడ్స్ అయిపోయాక తర్వాతి వారంలో ఒక్క రోజైనా లోదుస్తులు వేసుకోకుండా ఉండటం మంచిదని ఆరోగ్య నిపుణుల సూచన. ఆ రోజు వదులుగా ఉండే పైజామాలు, ప్యాంట్లలో సౌకర్యంగా ఉండండి. దీంతో ఒక రోజు బిగుతు బట్టల నుంచి ఉపశమనం దొరుకుతుంది.

**ప్యూబిక్ హెయిర్ రిమూవల్:**
జననేంద్రియాల్లో అవాంఛిత రోమాలను తొలగించడం కూడా శుభ్రతలో భాగమే. అయితే దానికోసం ఎలాంటి క్రీములు, పౌడర్లు, రసాయనాలు, థెరపీలు వాడకూడదు. బదులుగా కత్తెర లేదా రేజర్ వాడి షేవింగ్ చేయడం ఉత్తమం.

**సబ్బు వాడకం:**
వ్యక్తిగత భాగాల్ని శుభ్రం చేయడానికి ప్రత్యేక పర్ఫ్యూమ్ వాష్ అవసరం లేదు. మీరు రోజువారీ సబ్బు లేదా బాడీవాష్ వాడొచ్చు. చేతులోకి సబ్బు లేదా వాష్ తీసుకుని నురుగు వచ్చాక దాన్ని రాసుకుని నీళ్లతో శుభ్రం చేసుకుంటే చాలు. లేదా కేవలం ఎలాంటి సబ్బు లేకుండా నీళ్లు వాడినా సరిపోతుంది.

**మూత్ర విసర్జన:**
వ్యక్తిగత పరిశుభ్రత కోసం మూత్ర విసర్జన తర్వాత ప్రతిసారీ నీటితో బాగా కడుక్కోవాలి. కాస్త ఆరాక మాత్రమే ప్యాంటీ వేసుకోవాలి. మీ బాత్రూంలో దీనికోసం ఒక టవెల్ ఉంచుకోవడం ఉత్తమం. ప్రతిసారీ తుడుచుకునే వీలుంటుంది. అలాగే స్నానం చేశాక వెంటనే లోదుస్తులు వేసుకోకూడదు. తేమగా ఉన్న శరీరం మీద వేసుకుంటే ఇన్ఫెక్షన్ల అవకాశం పెరుగుతుంది. ఓ అయిదు నిమిషాలయినా ఆగి, చర్మం పొడిగా అయ్యాక వేసుకుంటే మంచిది. ఈ చిన్న మార్పు శుభ్రతకు సాయం చేస్తుంది.




# వేరే కోణంలో చూడొద్దు ప్లీజ్..

డేటింగ్ యాప్‌లో సెలబ్రిటీల పేర్లు ప్రస్తుతం బీటౌన్‌లో చర్చనీయాంశం అయ్యింది. ఈ పేర్లలో బాలీవుడ్ భామ ఊర్వశీ రౌతేలా పేరు కూడా ఉండటంతో.. ఈ వ్యవహారంపై ఊర్వశీ స్పందించింది. 'కేవలం మేం మాట్లాడుకోవడం కోసమే ఈ యాప్‌లో లాగిన్ అయ్యాం. ఇందులో నాతోపాటు హృతిక్, ఆదిత్యరాయ్.. ఇలా చాలామంది పేర్లున్నాయి. సమయం దొరికినప్పుడల్లా ఈ యాప్ ద్వారా మాట్లాడుకుంటూ ఉంటాం. లీజర్ టైమ్‌లో ఒకరికొకరం రిక్వెస్టులు పెట్టుకుంటాం. దయచేసి దీన్ని వేరే కోణంలో చూడొద్దు. ప్లీజ్..' అంటూ రిక్వెస్ట్ చేసింది ఊర్వశీ రౌతేలా. ప్రస్తుతం ఈ అందాలభామ టాలీవుడ్‌లో నటిస్తున్న విషయం తెలిసిందే. బాలకృష్ణ హీరోగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంలో ఊర్వశి కీలక పాత్ర పోషిస్తున్నది. ఈ సినిమా గురించి ఇటీవల మాట్లాడుతూ 'బలమైన కథతో రూపొందుతోన్న చిత్రమిది. ఇందులో నా పాత్ర కొత్తగా ఉంటుంది. బాలయ్యసార్‌తో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. ఆయన గొప్ప నటుడు మాత్రమే కాదు, మంచి వ్యక్తి కూడా. టాలీవుడ్ వాతావరణం నాకెంతో నచ్చింది. ఇక్కడ మరిన్ని సినిమాలు చేయాలని ఉంది' అంటూ చెప్పుకొచ్చింది ఊర్వశీ రౌతేలా.





# వుమెన్ ఆఫ్ ది ఇయర్

వైవిధ్య భరిత పాత్రలను ఎంచుకుంటూ తన నటన, అందంతో ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి సమంత. 'ఏమాయ చేశావే' సినిమాతో ప్రేక్షకులను మాయ చేసిన సమంత ఇప్పటికీ స్టార్ హీరోయిన్‌గా కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం సౌత్ ఇండియాలోని టాప్ హీరోయిన్లలో సమంత ఒకరు. అంతేకాకుండా అత్యధిక పారితోషికం అందుకుంటున్న సౌత్ కథానాయికలలో కూడా సమంత ముందు వరుసలో ఉంది. అయితే, ప్రస్తుతం అనారోగ్యం కారణంగా సినిమాలకు కొంత బ్రేక్ తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా సామ్‌కు అరుదైన గౌరవం దక్కింది. వుమెన్ ఆఫ్‌ది ఇయర్ అవార్డును గెలుసుకుంది. సినీరంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఐఫా అవార్డుల వేడుక అబుదాబి వేదికగా ఘనంగా జరుగుతోంది. ఈ ఈవెంట్‌లో బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్, కోలీవుడ్ నుంచి నటులు హాజరై సందడి చేశారు. ఈవెంట్‌లో భాగంగా రెండో రోజు స్టార్ నటులు సమంత, రానా, వెంకటేశ్, బాలకృష్ణ, చిరంజీవి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. ఈ వేడుకల్లోనే సామ్‌ను నిర్వాహకులు ప్రతిష్ఠాత్మక 'వుమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు'తో సత్కరించారు. ఇక ఈ వేడుకల్లో మెగాస్టార్ చిరంజీవి మరో ప్రతిష్ఠాత్మక అవార్డును కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఐఫా 2024కు గాను 'ఔట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా' అవార్డును మెగాస్టార్ అందుకున్నారు. బాలీవుడ్ దిగ్గజం లిరిక్ రైటర్ జావేద్ అక్తర్ చేతుల మీదుగా మెగాస్టార్ ఈ అవార్డును అందుకున్నారు. మరోవైపు ఉత్తమ చిత్రం విభాగంలో రజనీకాంత్ నటించిన 'జైలర్' సినిమాకు అవార్డు దక్కగా.. ఉత్తమ నటుడు తెలుగు విభాగంలో 'దసరా' సినిమాకు నాని అవార్డు అందుకున్నారు.



# మునుపెన్నడూ కనిపించని స్టన్నింగ్ లుక్

యూత్‌లో విజయ్ దేవరకొండకు ఉన్న ఫాలోయింగ్ సామాన్యమైనది కాదు. సినిమాల ప్రతికూల ఫలితాలు కూడా ఆయన ఇమేజ్‌పై ప్రభావం చూపలేకపోయాయి. ప్రస్తుతం విజయ్ చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి. అందులో ఒకటి 'జెర్సీ'ఫేం గౌతమ్ తిన్ననూరి సినిమా. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉంది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర విభిన్నంగా, భావోద్వేగపూరితంగా ఉంటుందని తెలుస్తున్నది. అలాగే.. 'రాజావారు రాణిగారు' ఫేం రవికిరణ్ కోల దర్శకత్వంలో కూడా ఓ చిత్రం చేయనున్నారట విజయ్ దేవరకొండ. రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటైర్టెనర్‌గా ఈ సినిమా రూపొందనుందని సమాచారం.

ఇక మూడోది రాహుల్ సంకృత్యన్ సినిమా. విజయ్ దేవరకొండ 'ట్యాక్సీవాలా'తో దర్శకుడిగా పరిచయమైన రాహుల్.. ఆ తర్వాత నానితో 'శ్యాంమ్‌సింగరాయ్' సినిమా చేశారు. రెండూ హిట్లే. ఇప్పుడు మూడో సినిమా విజయ్ దేవరకొండతో చేయనున్నారాయన. అక్టోబర్‌లో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హైదరాబాద్, కర్నూల్, అనంతపూర్, కడప జిల్లాల్లోని కొన్ని అరుదైన లొకేషన్స్‌లో ఈ సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారట. ఇందులో మునుపెన్నడూ కనిపించని విధంగా, స్టన్నింగ్ లుక్‌తో విజయ్ కనిపిస్తారని ఫిల్మ్ వర్గాలు చెబుతున్నాయి. విజయ్ అభిమానులు పండుగ చేసుకునేలా ఆయన కేరక్టరైజేషన్ ఉంటుందట. మొత్తంగా ముగ్గురు వైవిధ్యమైన దర్శకులతో విభిన్నమైన కథలతో సినిమాలు చేస్తూ విజయ్ దేవరకొండ బిజీబిజీగా ఉన్నారు.

# క్రైమ్ కామెడీ కనకరాజు

వైవిధ్యమైన పాత్రల్ని ఎంచుకుంటూ నటుడిగా ఎదుగుతున్నారు వరుణ్‌తేజ్. కంచె, గద్దలకొండ గణేష్, తొలిప్రేమ. ఎఫ్ 1, ఎఫ్ 2.. ఇలా పొంతన లేని పాత్రలతో భిన్నమైన ఇమేజ్‌ను సాధించారాయన. ప్రస్తుతం వరుణ్ చేస్తున్న సినిమా 'మట్కా'. కరుణకుమార్ దర్శకత్వంలో రూపొందుతోన్న పీరియాడిక్ డ్రామా ఇది. గాంబ్లింగ్ గేమ్ నేపథ్యంలో వాస్తవ సంఘటనల ఆధారంగా కరుణకుమార్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇందులో కూడా వరుణ్‌ది వైరైటీ కేరక్టరే. ఇదిలావుంటే.. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో సినిమాకు పచ్చజెండా ఊపారు వరుణ్‌తేజ్. క్రైమ్ కామెడీ నేపథ్యంలో సాగే ఈ సినిమా ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్నది. ఈ సినిమాకు 'కనకరాజు' అనే టైటిల్‌ను అనుకుంటున్నారట. దాదాపు ఇదే టైటిల్ ఫైనల్ అయ్యే అవకాశం ఉందని ఫిల్మ్ వర్గాలు చెబుతున్నాయి. నవంబర్‌లో షూటింగ్ స్టార్ట్ అయ్యే ఈ సినిమాలో కమెడియన్ సత్య పాత్ర కీలకంగా ఉంటుందని సమాచారం.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com